

# అన్నయ్య పెళ్ళి!

అక్కడంతా హడావుడిగా వుంది. షామియానా కింద వంద కుర్చీలూ, అందులో చెదురు మదురుగా జనం. సూట్లలో ఉన్నవాళ్ళూ ఖరీదైన పట్టుచీరల్లో ఉన్నవాళ్ళూ ఎక్కువగా వున్నారు. అంతా చదువుకున్న వాళ్ళలా కనిపిస్తున్నారు. చాలా తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ సరదాగా ఉన్నారు.

ఓ మ్యూలవ విసిరేసినట్లు ఓ పాతిక కుర్చీల్లో ఆడామగా ఓ పాతిక మంది కూర్చుని ఉన్నారు. షామియానాకి బైట ఎత్తు అరుగుమీద కొందరు మగాళ్ళు కూచుని, ఉన్నారు. పిల్లలు ఆడుకుంటు న్నారు. ఓ పదిమంది ఆడ పిల్లలు మన్నగా నూనెపెట్టి దువ్వుకుని 2 జడలు వేసుకుని బంతిపూలమాలలు తలనిండా పెట్టుకున్నారు. రెండు జడలూ మడిచి కడితేనే వాళ్ళ వీపుల సగానికి వచ్చాయి జడలు. పిల్లలు పిల్లల్లా లేరు. పెద్దవాళ్ళలా బుద్ధిగా కూచుని ఉన్నారు. ఇద్దరో ముగ్గురో తొక్కుడుబిళ్ళ ఆడుకోడానికి ప్రయత్నం చేశారుగానీ అక్కడ కూచున్న ఆడాళ్ళు మగవాళ్ళూ వాళ్ళని కోప్పడి సర్ది కూచోపెట్టేశారు. ఒక్కో కుర్చీలో ఇద్దరేసి పిల్లలు కూచున్నారు.

చంటి పిల్లల తల్లులు ఆ కుర్చీల్లో కూచుని పాలివ్వడం కుదరక అటూ ఇటూ సర్దుకుంటూ ఏడుస్తున్న పిల్లల్ని సముదాయించుకుంటూ పైటలు కప్పుకుంటూ ఇబ్బంది ఫీలవుతున్నట్లున్నారు.

నీలం పట్టులంగాకి గోల్డ్‌స్ప్రాటు అంచు, గోల్డ్‌స్ప్రాటు జాకెట్టూ. గోల్డ్‌స్ప్రాటు ఓణీ వేసుకున్న అమ్మాయి కాస్త లోపలికీ బయటకూ తిరుగుతుంది.

"లతమ్మా! ఏందే అటూ ఇటూ తిరుగుతూ ఉండావు. ఒకకాడ కూసోరాదంటే." అంది ఒక ముసలమ్మ.

ఒక్క అరక్షణంపాటు అక్కడున్న అందరి కళ్ళూ ఈ ముసలమ్మ వేపు ఆ తిరుగుతున్న లత

అనే పిల్లవేపు తిరిగాయి. ఆ అరక్షణం ఈ పిల్ల ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకినట్లయింది. అలా అంటేనే బావుంటుంది మరి. ఎన్నడూ అలాంటి జంతువులేమీ పాకి ఉన్న అనుభవం లేకపోయినా ఊహిస్తేనే జుగుప్సాకరంగా ఉంటాయి గదా ఆ స్పర్శలు. అందుకని ఆ పోలికే బావుంది. అంతా అరక్షణమే. ఆనక అంతా ఎవరి ధోరణిలో వాళ్ళు పడ్డారు.

లత నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి ఆ ముసలమ్మతో పోట్లాడింది. ఎందుకట్లా అరుస్తావని

"నేనే మరినానే! అట్లా ఊకనే తిరుగుతే దిట్టి తగులుద్దనిగాని ఎవరు ఎట్టాపోతేనేం." అంటూ వెంటనే ముక్కు చీదేసింది. ఎందుకొచ్చిన గోలరా బాబూ కదిలించానే అనవసరంగా అన్నట్టు ముఖం పెట్టి పక్కనే కుర్చీ బర్రన లాక్కుని కూచుంది లత.

లతకి అక్కడ భాగా పెత్తనం చెయ్యాలని ఉంది. అంతా తన స్నేహితుల్ని వేసుకుని కలయ తిరగాలని ఉంది.

డాక్టరు చదువుతున్న అన్నయ్యని గురించి వీళ్ళ తరబడి ఎన్నిగొప్పలు చెప్పుకుందో తను. పెద్దక్క ఎలీషమ్మ పెళ్ళికి అన్న ఇంకా ఇంటరు చదువుతున్నాడు. పెళ్ళికొచ్చిన పెద్దలంతా అన్నని బహుగొప్పగా చూశారు.

బావయితే, "ఒరే బామ్మరిదీ! నువ్వు డాక్టరువయితే నేను ఈ గవర్నమెంటు ఉద్యోగం కూడా వదిలేసి నీకాడే కంపౌండరుగా ఉంటాన్రా." అనే వాడు. కొత్త పెళ్ళికొడుకయినా బావలాగా కలిసిపోయాడు.

లతకి అక్క పెళ్ళి, అప్పటి సంబరం, ఆ కబుర్లు, అన్నీ గుర్తొస్తున్నాయి. బావ వంక చూసింది. తెల్లపాంటు తెల్లషర్టుల్లో ఇంకా నల్లగా కనిపిస్తున్నారు బావ అనుకుంది.

పిల్లవాణ్ణి ఎత్తుకుని అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. బావ అట్లా పచార్లు చేస్తుంటే ఎవరూ ఏమనరు. నేను అటూ ఇటూ కాస్త తిరిగితే మాత్రం అందరూ తిడతారు. అందరూ వివేట్లు అనుకుంది లత.

లోపల్నుంచి చంద్రం మాటులో బయటకు వస్తున్నాడు. "అబ్బ అన్న ఎంత బాగున్నాడో" అనేసింది లత గట్టిగా. తనకు తెలియకుండానే కుర్చీలోంచి లేచి గబగబా అన్న దగ్గరికి పరిగెత్తబోయింది. ఇంతలో చంద్ర చుట్టూ అతని క్లాస్‌మేట్స్, స్నేహితులు చేరారు అందులో ఆడవాళ్ళూ ఉన్నారు.

లతకి అన్నయ్య ప్రక్కనే ఉండాలని ఉంది.

అక్క ఆడబడుచు అక్క పెళ్ళిలో బావ పక్కనే ఉంది. తను చాలా చిన్నది అప్పటికి. తమా అక్క ప్రక్కనే ఉండేది. ఎన్ని చతుర్లాడుకున్నారో!

అవ్వకూడా సరదాగా భలే చతుర్లాడేది అనుకుంది లత. లతకి అసంతృప్తిగా ఉంది.

అన్నయ్య పెళ్ళిలో తనకేమీ ప్రాముఖ్యత లేదేంటి అని బాధగా ఉంది.

హలోలు, నమస్తేలు ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి.

కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ చంద్రం— అని కూడా వినిపిస్తున్నాయి. లత టెన్త్ క్లాసు చదువుతూంది.

అన్నయ్య పెళ్ళి చేసుకుంటుంటే కంగ్రాచ్యులేషన్స్ ఎందుకో ఆ పిల్లకి అర్థం కాలేదు.

తనకి స్పోర్ట్సులోనో సైన్సులోనో ఫస్టులొస్తే మాస్టర్లు, టీచర్లు కంగ్రాచ్యులేషన్స్ చెప్తారు, అన్నయ్య పెళ్ళి చేసుకుంటుంటే ఎందుకో అర్థం కాలేదు.

ఆ పిల్లకి తెలీదు. తనకు దొరికిన వదిన సామాన్యురాలు కాదని. అన్న దగ్గరికి వెళ్ళడానికి కళ్ళు ఎత్తి ఎత్తి చూస్తూ ప్రయత్నిస్తూనే ఉంది.

"సెంద్రయ్యొచ్చాడా!" అంది అవ్వ.

"ష్! సెంద్రయ్యేందే! సెంద్రం" అంటూన్న ది ఎలీషమ్మ. "అక్కా సెంద్రం కాదే! చంద్రం, చంద్రమోహన్. అన్న చంద్రమోహన్ అని పెళ్ళి పత్రికల్లో వేయించుకున్నాడు తెలుసా!" అంది లత వెనక్కు తిరిగి రహస్యంగా.

"ఏందీ సెంద్ర...." అంది అవ్వ తనూ రహస్యంగానే.

"సెంద్రకాదే! చంద్ర... చంద్రమోహన్" అంది లత.

"ఏందో. ఆళ్ళ తాతపేరు సెందరయ్య. కామందులు సెంద్రిగా సెంద్రిగా అని ముద్దుగా పిల్చుకునేవోరు." నెమ్మదిగా గొణుక్కుంది ముసలమ్మ.

"ఎహె! పోనీయ్యే. మనోడు గొప్పోడై పొయ్యాడు. పేరేందైతే ఏందే?" కసిరింది ఎలీషమ్మ.

అప్పటిదాకా పచార్లు చేస్తున్న ఎలీషమ్మ పెనిమిటి ఆగిపోయి బావమరిది వేపు చూస్తున్నాడు చేతిలో ఉన్న పిల్లవాడికి "మామరా మామ" అని చేత్తో చూపిస్తున్నాడు.

అక్కడ కూచున్న వాళ్ళలో కలకలం. గుసగుసలు. వీళ్ళ దగ్గరకి పెళ్ళికొడుకు రాలేదు. వీళ్ళక్కడికి పోడానికి వీలు కుదరలేదు. ఎక్కడివాళ్ళక్కడే ఉన్నారు.

నలుగురైదుగురు కుర్రాళ్ళకి కుర్చీలు సర్దడం మొదలుపెట్టారు. ఇంకా రెండొందల కుర్చీలకి పైన లారీలో వచ్చాయి. సర్దుడు చూస్తూనే చేతుల్లో పసిపిల్లలకి పాలిస్తున్న తల్లులూ యాధాలాపంగా కూచుని పెళ్ళికొడుకు వేపు చూస్తున్న ఆడాళ్ళూ మగాళ్ళూ ముసలమ్మా— అందరూ లేచారు.

"సర్దినాక కూసుందురు ఒక్కసారి లెగండి." అంటున్నాడు ఒకడు.

లేచిన వాళ్ళంతా గుంపుగా ఓ వారకి చేరారు.

ఒక బల్ల— దానిమీద ఫ్లవర్ వాజులు అగర్‌బత్తీలు— బల్లముందు ఏడు కుర్చీలు వేశారు.

సభ జరగబోతున్నట్లుగా ఉంది.


లతకి హుషారుషారుగా ఉంది. చప్పగానూ ఉంది.


"మనూళ్ళో పెళ్ళిళ్ళయితే ఇట్టా గాదు కదక్కా" అంది అక్కతో. "ఇష్! అరవమాకు. ఈళ్ళిళ్ళల్లో ఇంతేగావును." అంది ఎలీష.

ఎవరికీ మాట్లాడాలనిపించడం లేదు. ఎవరికి వాళ్ళకే మనసులో ఏదో వెలితిగా ఉంది.

లత "అన్నా!" కేకేసింది.

చంద్రానికి వినిపించినట్లే లేదు. తనచుట్టూ ఉన్నవాళ్ళతో కలిసి ముందు వేపుకి వెళ్తున్నాడు.






తండ్రి: ఏమిట్రా నానూ ఆ మట్టినంతా అలా తవ్వేస్తున్నావ్?

కొడుకు: మీ పేరు నేను మట్టిలో కలిపానని మండిపడుతుంటారు కదా అందుకని మీ పేరు ఎక్కడుందో వెదుకుతున్నా.

లత అందరిలోంచి దూరి అన్న పక్కకి చేరింది. అన్న చెయ్యిపట్టుకుంది. ఒక్కసారి ఉలిక్కిపడ్డట్లు నడుస్తున్నవాడల్లా ఆగి చెల్లెలి వంక చూశాడు.

లత తల ఎత్తి అన్నగారి వంక చూసింది.

ఆ పిల్ల కళ్ళలో సన్నని తడి తెర ఉన్నట్లు అనిపించింది చంద్రానికి. లత చుట్టూ చెయ్యివేసి.

"మా చెల్లెలు స్నేహలత." అని అందరికీ చెప్పాడు.

లతకి సిగ్గనిపించింది. తలదించేసుకుని అన్నగారికి ఇంకా అతుక్కుపోయింది.

"ఎందుకురా! సిగ్గు. నమస్తే చెప్పు" అన్నారు చంద్రం.

రెండు చేతులూ జోడించింది. టెన్త్ క్లాసు చదువుతూ అన్నగారి చేత పసిపిల్లలా చెప్పించుకున్నందుకు సిగ్గు పడింది లత.

"టెన్త్ చదువుతోంది." అని

"అమ్మానాన్న వాళ్ళేరమ్మా" అన్నాడు చంద్రం.

"అరుగో అక్కడ" మూలకి చూపించింది.

నాలుగైదు వందల కుర్చీల్లో ఓ మూల ఒదిగి ఒక గుంపుగా కూచున్న తనవాళ్ళు కనిపించారు చంద్రానికి.

"ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మీ. కూర్చోండి." అని తన చుట్టూ ఉన్న ఫ్రెండ్స్‌కి చెప్పి వాళ్ళ దగ్గరకి వెళ్ళాడు.

అవ్వ రెండు చేతులతోనూ "సెంద్రయ్యా" అనుకుంటూ తడిమి తడిమి చూసుకుని మురిసిపోయింది.

అందరి ముఖాల్లోనూ అనిర్వచనీయానందం.

"అక్కా బావ ఏడే?" తమ్ముడు తనని ప్రత్యేకంగా అడిగినందుకు ఏనుగెక్కినంతయింది ఎలీషమ్మకి.

"బావ అదుగో" అంది లత.

ఎలీషమ్మ మొగుడు నెమ్మదిగా దగ్గరికొచ్చాడు.

"బావా! మంచున్నావేంటి! ఇంకనీకాడ నించో నర్చిందేగా! నువ్వు డాక్టరువి. నేను కంపౌండర్ని." నవ్వాడు.

చంద్రమూ నవ్వాడు.

అందరూ నవ్వారు. 'అబ్బ ఇప్పటికి పెళ్ళికళొచ్చింది' అనుకుంది లత.

"రండి బావా రండి, రా అవ్వా, అమ్మా నాయనేడే అందరూ వచ్చి, ఇటు కూచోండి." అంటూ చెల్లెలి చెయ్యి పట్టుకుని ముందువేపు కుర్చీల్లో కూచోపెట్టాడు.

"పెళ్ళి టయిమయ్యింది. మరి మొదలు పెడదామా!" అన్నాడొకాయన. చంద్రం దగ్గరకొచ్చి.

"ఊఁ! నాదేముంది స్వర్ణ రెడీ అయిందో లేదో కనుక్కోండి" స్వర్ణ చంద్రానికి కాబోయే భార్య.

"స్వర్ణ కూడా రెడీయే. మళ్ళా పదిన్నర దాటుతుంది. ముందే జరగాలి" అన్నాడాయన.

"కానీయండి" అన్నాడు చంద్రం.

"చిరంజీవి లక్ష్మీసౌభాగ్యవతి స్వర్ణకుమారి చిరంజీవి చంద్రమోహన్‌ల వివాహసందర్భంగా మనమందరమూ ఇక్కడ సభ తీరినామన్న విషయం మీకందరకూ తెలిసినదే.

వివాహమహోత్సవం ఆరంభం కాబోతున్నది. అందరూ నిశబ్దంగా ఎవరి కుర్చీలలో వారు కూర్చోవలసిందిగా ప్రార్థిస్తున్నాము" అంటూ చంద్రాన్ని పెళ్ళి మొదలు పెడదామా అని అడిగినాయన మైకులో చెప్పగానే అందరూ సర్దుకుని కూచున్నారు.

లతని కూడా ఓ కుర్చీలో కూచోబెట్టి చంద్రం మొదటి వరుసలో వేసిన చేతుల కుర్చీలు రెండింటిలో ఒక దాంట్లో కూర్చున్నాడు.

ఇంతలో స్వర్ణకుమారి వెంట పాతికమంది ఆడవాళ్ళతో లోపల్నుంచి సభలోకి వచ్చింది. మళ్ళీ హలోలూ, హాయ్‌లూ, నమస్తేలూ—

బంగారువో— బంగారు రంగువో మొత్తానికి రెండు చేతుల్నిండా గాజులు— ఎర్ర పట్టుచీర పన్నెండంగుళాల జరీ అంచుతో. అదేలాంటి జాకెట్టు. నడుముకి వడ్డాణం. క్రిందకు వేళ్ళాడుతూ కందూరా. మెడలో ఎనిమిది వరుసల చంద్రహారం. అలంకరించిన రథంలా ఉంది.

"వామ్మో! ఎన్ని నగలో" అంది లత "అబ్బ! అరిస్తావేందే! అరవమాక. దేబిరిగొట్టు ముఖమూ!" అంది ఎలీషమ్మ.

"సద్దాక వాదులాడుకుంటారేందే! నోరు మూసుకోండి. ఇంటికెళ్ళినాక మాట్లాడదారి." అంది చంద్ర తల్లి.

స్వర్ణకుమారి కూడా వెళ్ళి చంద్రం కుర్చీ పక్కన కూచుంది. చంద్రం పక్కకు తిరిగి ఏదో అన్నాడు.

స్వర్ణకుమారి కూడా ఏదో అంది. ఇద్దరూ నవ్వుకున్నారు.

లతకి వాళ్ళ పక్కనే ఉండాలని ఉంది.


పెళ్ళికూతురి పక్కనకూడా ఎవురూ లేరులే. ఇది ఒక తృప్తి లతకి.

ఈసారి చిరంజీవి ల.సౌ. స్వర్ణకుమారి ఎం.బి.బి.ఎస్, డి.జి.వో, చిరంజీవి చంద్రమోహన్ ఎం.బి.బి.ఎస్ ఎం.డిల వివాహం జరుగబోతోంది.

"ముందుగా డా. చంద్రమోహన్ గార్ని వేదికమీదకు రావలసిందిగా ఆహ్వానిస్తున్నాం" అన్నాడిందాకటాయన.

చంద్రం కోటు సరిచేసుకుంటూ ఠీవిగా వెళ్ళి వేదికమీది కుర్చీలో కూర్చున్నాడు.

తరువాత "చి.ల.సౌ డా. స్వర్ణకుమారి గారిని కూడా వేదిక మీదికి రావలసిందిగా కోరుతున్నాము" అన్నాడు.



స్వర్ణకుమారి కూడా వేదిక మీద కుర్చీలో కూచుంది."డా. చంద్రమోహన్ గారి తలిదండ్రులు శ్రీ జీవరత్నంగారినీ, శ్రీమతి జీవరత్నంగారినీ వేదికమీదకు రావలసిందిగా ప్రార్థిస్తున్నాము"అన్నాడాయన.

చంద్రమోహన్ తండ్రి బయట చుట్టకాలుస్తూ నిలబడిన వాడల్లా ఉలిక్కిపడి చుట్టపారేసి వేదికవేపు వెళ్ళాడు మధ్యలో భార్యవంక చూసి రమ్మన్నాడు.

"నువ్వు పోలే. నేనెందుకు?" అంటోందామె.

"రండమ్మా టైం దాటిపోతూంది" అన్నాడాయనే మైకులో. లత తల్లిచేయి పట్టుకుని లేపింది. జంకు జంకుగా భర్త వెనకావే వేదిక దగ్గరకు వెళ్ళింది ఆమె. పేరు ఈశ్వరమ్మ. అసలామెకు శ్రీమతి జీవరత్నం అంటే త నేనని సరిగ్గా తెలియులేదు కూడా.

"డా. స్వర్ణకుమారి తండ్రిగారు డా. సదాశివరావు గారినీ తల్లిగారు డా. సువర్ణముఖి గారిని కూడా వేదికమీదికి రావలసిందిగా కోరుచున్నాము" అన్నాడాయన మళ్ళీ.

మాంఛి సూట్‌లో వెయ్యేత్తున డా. సదాశివ రావు గారు చాలా హుందాగా ఉన్నారు.

రవ్వముక్కుపుడక రవ్వల కమ్మల, రవ్వలగాజులు, రవ్వనెక్లెసులతో సింపుల్‌గా గ్రాండ్‌గా డా. సువర్ణముఖి గుండ్రంగా, నిండుగా పెద్ద పేరంటాలులా ఉంది. ఆమె పేరున్న పెద్ద గైనకాలజిస్టు.

పెళ్ళి చేసేందుకు ఇద్దరు పిల్కు లాల్చీ లైట్ గోధుమ రంగు పంచె కట్టుకున్న పెద్ద మనిషిని కూడా వేదిక మీదికి ఆహ్వానించారు. సభాధ్యక్షులు డా. రామిరెడ్డిగారిని సభానిర్వహణకు ఆహ్వానించారు.

పెద్దమనిషి పెళ్ళి ప్రమాణాలు చేయించాడు.

సరిగ్గా 10 గంట.ల 28 ని.ల కూడా స్వర్ణకుమారి మెడలో డా. చంద్రమోహన్ తాళికట్టాడు.

అక్కడే వేదికమీద పళ్ళెంలో పసుపు కలిపిన బియ్యం, పూలు వున్నాయి.

"అందరూ ఆశీర్వదించండి" అన్న పెళ్ళి పెద్ద- పురోహితుడు మాటలు విని ఒక్కొక్కళ్ళే లేచి వేదికమీదికి రావడం ఆ బియ్యం పూలు పెళ్ళి కుమారుడు పెళ్ళి కుమార్తెల తలలమీద వెయ్యడం ఈ తంతు ఒక పావుగంట జరిగింది.

సభాధ్యక్షులు రామిరెడ్డిగారు- ఆయనా డాక్టరే - ఈ దంపతులెంత అదృష్టవంతులో- ఇందాక పెళ్ళి టైం మించిపోతుంది కనక తాను ఆపిన అధ్యక్షోపన్యాసం- కొనసాగిస్తూ- డా. సదాశివరావుగారూ- సువర్ణముఖిగారూ ఎంత గొప్ప డాక్టర్లో- వాళ్ళ ఆధ్వర్యంలో పెళ్ళి చేసుకుంటున్న ఈ దంపతులు ఎంత అదృష్టవంతులో- వొక్కి వక్కాణించారు.

"అలాంటి గొప్ప వైద్య సాంప్రదాయంగల ఇంటికి డా. చంద్రమోహన్ అల్లుడుకావడం అతని అదృష్టం. స్వర్ణకుమారి లాంటి డాక్టరు చదువుకున్న అమ్మాయి అందమైన అమ్మాయి దొరకడం అతని పూర్వజన్మ సుకృతం." అంటూ ముగించారు.

ముగిస్తూ "శ్రీ జీవరత్నం శ్రీమతి జీవరత్నం గారలు ఇలాంటి ఆణిముత్యాన్ని గన్నందుకు ధన్యులు" అని కూడా అన్నారు.

డా. సదాశివరావుగారు వియ్యంకుడికి షేక్‌హాండిచ్చి అక్కున అదుముకున్నారు.

డా. సువర్ణముఖి లేచి నించుని వియ్యపురాలి దగ్గరకు వెళ్ళి రెండు చేతులూ జోడించి నమస్కారం చేసింది. ఈశ్వరమ్మ తత్తరలాడుతూ లేచినించుని ఎదురు నమస్కారం చేసింది.

రవ్వలగాజులతో రవ్వ ఉంగరంతో కాంతులీనుతూ ఉన్న రెండు సున్నితమైన హస్తాల ముందు నాట్లకూ, వరికోతలకూ, పిడకలు చెయ్యడానికీ, పాలు పితకడానికీ అలవాటు పడ్డ రెండు నల్లని మొరటు చేతుల జోడింపు విచిత్రంగా ఉంది.

నల్లని సముద్రపు నీరు నీలాకాశాన్ని తాకినట్లుంది.

లతకి ఎక్కడో ఏదో అసంతృప్తి.

ఎలీషమ్మకి తమ్ముడు ఏదో పక్షిరెక్క పట్టుకుని ఆకాశానికి ఎగురుతున్న అనుభూతి.

జీవరత్నానికి, "అదైనా సుకపడ్డాడు." అన్న సంతృప్తి.

ఈశ్వరమ్మకు పేగు తెగిన బాధ.


ఎలీషమ్మ మొగుడు మాత్రం "ఒరే బామ్మర్దిగారూ! నా గవర్నమెంటు సర్వీసులో- పాత డాక్టర్లు మా సీనియర్లూ- కొత్త డాక్టర్లు మా జూనియర్లూ ఒరి బామ్మర్దీ! నువ్వెప్పుడూ మీ అత్తా మావగార్లకు మాత్రం జూనియరువేరా!" అనుకున్నాడు.


కులరహిత సమాజాన్ని నిర్మించేందుకు ఇలాంటి వివాహాల అవసరం ఎంతుందో- సదాశివరావుగారూ, సువర్ణముఖిగారూ చివరికి స్వర్ణకుమారిగారూ ఈ సంఘ సంస్కరణకోసం చంద్రమోహన్‌ని చేసుకుని ఎంత త్యాగం చేశారో ఇంకా ప్రసంగాలు కొనసాగుతూనే ఉన్నాయి.

"ఏందిరా! అదేం బామ్మదురా! అరంజోతిని సూపిచ్చరేంటి? అరంజోతిని సూడకపోతే పెళ్ళేందిరా?" అంటూ గొణుక్కుంటూనే ఉంది. సెంద్రయ్య అవ్వ.

చంద్రం, డా. స్వర్ణకుమారి మెళ్ళో పెద్ద పెద్ద ఎర్ర రోజా పూలదండ వేశాడు. డా. స్వర్ణకూడా పూలదండ చంద్రం మెళ్ళో వేసింది. వాళ్ళ తలలమీంచి పసుపుబియ్యం, పూలరేకుల్తో కలిపి రాల్తున్నాయి. వేదికమీద కార్పెట్‌మీద అవి రాలి రంగులు రంగులుగా సుందరంగా ఉంది.

లతకి ఎందుకో అక్కడ ఉండ బుద్ది కావడం లేదు. ●



ఈ మధ్య మన ప్రసాదులో స్కూటర్ కొన్నాక ఏదన్నా మార్పు వచ్చిందా? అడిగాడు శర్మ, రాధాకృష్ణని

ఇన్నాళ్ళూ వాడి మెదడు మోకాల్లో వుండేది. ఇప్పుడు స్కూటర్‌కి లెగ్ బ్రేక్ వుండడంతో ఆ మెదడు కాస్తా అరికాల్లోకి దిగింది. చెప్పాడు రాధాకృష్ణ